క్లుప్తంగా

మైక్‌సెట్ అందజేత

భైంసాటౌన్:హైదరాబాద్‌కు చెందిన కర్మయోగి సేవా సంస్థ, మిత్రబృందం ఆధ్వర్యంలో పట్టణంలోని గుజిరిగల్లి శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలకు మైక్‌సెట్ విరాళంగా అందజేశారు. ఈ మేరకు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి రూ.25వేల విలువైన మైక్‌సెట్, పోడియం అందించారు. అనంతరం పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు, ఉపాధ్యాయులు సేవా సంస్థ నిర్వాహకులను సన్మానించారు. పాఠశాల అధ్యక్షులు డి.శ్రీధర్, శివకుమార్, సురేశ్, పురస్తు గోపాల్, గంగాధర్ తదితరులున్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

సోన్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఎనిమియా సేముక్త్ కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మాత్రలు అందించారు. పీహెచ్‌సీల్లో వ్యాయామ పరికరాలున్నాయని.. సాధారణ ప్రసవం జరిగేలా వ్యాయామం చేయాలని గర్భిణులకు సూచించారు. వైద్యాధికారి శ్రీనివాస్, డా.వెంకటేశ్వర్లు, రమాదేవి, హెచ్ఈవో సత్యనారాయణ, సంతోశ్, మాధవి తదితరులు ఉన్నారు.

వర్షం కురువాలని పూజలు



గంగాజలం తీసుకొస్తున్న గ్రామస్తులు

భైంసారూరల్: మండలంలోని దేగాంలో వర్షాలు కురువాలని మంగళవారం గ్రామదేవతలకు పూజలు చేశారు. గ్రామస్తులు బాసర గోదావరికి పాదయాత్రగా వెళ్లి పూజలు చేశారు. అనంతరం గంగాజలం తీసుకొచ్చి గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు.
కుంటాల: మండలంలోని అంబకంటిలో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు కురిసి పంటలు పండాలని బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆరోగ్యం పాడుచేసుకోవద్దు

మామడ: గుడుంబా తాగి ఆరోగ్యం పాడు చేసుకోవద్దని ఎక్సైజ్ ఎస్సై ఆర్.రవికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆరేపల్లి గ్రామంలో గుడుంబా వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం గుడుంబా విక్రయ, తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ముడిసరుకు, ఐదు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని షీలాబాయి, అమర్‌సింగ్‌ను తహసీల్దార్ ఆరిఫా ఎదుట బైండోవర్ చేశారు. పలువురు సిబ్బంది నరేందర్, రషీద్, గౌతం, ఇర్ఫాన్, మధు, కల్పన ఉన్నారు.

'కస్తూరిబా'లో సౌకర్యాలు కల్పించాలి



వంటగదిని పరిశీలిస్తున్న వినోద్‌నాయక్

దస్తురాబాద్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో సౌకర్యాలు కల్పించాలని ఏబీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ అన్నారు. మంగళవారం కస్తూరిబాను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థినులు నేలపై పడుకుంటున్నందున సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి విషపురుగులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్, నరేశ్, రవి, లచ్చన్న, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తానూరు: మండల కేంద్రంలోని భవిత విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం 22 మంది దివ్యాంగులైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం మందులు అందించినట్లు ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ఐఆర్‌టీ భూమన్న, రాము, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గీతాజ్ఞాన యజ్ఞం



హారతి ఇస్తున్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని వాసవిమాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 74వ గీతా జ్ఞాన యజ్ఞం ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మెట్‌పల్లి సత్సంగ్ వ్యవస్థాపకులు చత్రపతి ఆధ్వర్యంలో 15 రోజులుగా భగవద్గీత పారాయణం నిర్వహించారు. సత్సంగ్ భక్తుల భక్తిగీతాలు, సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఛత్రపతి–పద్మావతి దంపతులను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. గీతాశ్లోకాల కంఠస్థ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జితేందర్, మాధవి, గీతారాణి, వాసవి, సరిత, రాధిక, సతీశ్, స్రవంతి, వరలక్ష్మి, శ్వేత, శేఖరయ్య, ప్రకాశ్, అశోక్ ఉన్నారు.

సమస్యల్లో సర్కారుబడి

- భైంసా మదీనకాలనీ ప్రాథమిక పాఠశాలలో సౌకర్యాలు కరువు
- బాలబాలికలకు ఒక్కటే మరుగుదొడ్డి
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు



నీటి వసతి లేక నిరుపయోగంగా మరుగుదొడ్డి



భవన శిథిలాలతో అధ్వానంగా పాఠశాల మైదానం

భైంసాటౌన్: కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని పాలకులు చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో నీటిమూటలుగా మిగులుతున్నాయి. పట్టణంలోని మదీనాకాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మీడియం పాఠశాలలు ఒకే భవనం ఆవరణలో ఉన్నాయి. మూడు మీడియంలలో కలిపి 128 మంది విద్యార్థులు చదువుతుండగా.. తెలుగు–10, ఆంగ్లం–18, ఉర్దూ మీడియంలలో వంద మంది చదువుతున్నారు. ఒక్కో మీడియానికి ఒక్కో ఉపాధ్యాయుడు విధులు నిర్వర్తిస్తున్నాడు. ఉర్దూ మీడియంలో ఒక్కరే వంద మందికి బోధిస్తున్నాడు.. దీంతో మరో ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.

పాఠశాల స్థలం మార్కెట్‌కు కేటాయింపు..

ఇటీవల పాఠశాల పాతభవనం కూల్చివేసి, అందులో కొంత స్థలాన్ని సమీకృత మార్కెట్ నిర్మాణం కోసం కేటాయించారు. దీంతో ప్రస్తుతం ఈ పాఠశాల మైదానంలో పాతభవనాల శిథిలాలతో అధ్వానంగా మారింది. విద్యార్థులు ఆటలు ఆడే సమయంలో కిందపడి గాయాలపాలయ్యే ప్రమాదముంది.

128 మందికి ఒక్కటే మరుగుదొడ్డి.. నీటి వసతి కరువు

పాఠశాల ఆవరణలో 128 మంది విద్యార్థులకు ఒకే మరుగుదొడ్డి, మూత్రశాల ఉండడంతో సరిపోవడం లేదు. దీనికితోడు మూత్రశాలలకు నీటి వసతి లేకపోవడంతో అది కూడా నిరుపయోగంగా మారింది. విద్యార్థులు పాఠశాల వెనుక వైపు పెద్ద డ్రెయినేజీ వద్దకు మూత్ర విసర్జనకు వెళ్లి అందులో పడిన సందర్భాలున్నాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. పాఠశాలకు చెందిన బోరుమోటారు నీటిని.. పక్కనే నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ నిర్మాణ పనులకు వినియోగిస్తున్నారని వాపోయారు. ప్రస్తుతం బోరు మోటారు సమీకృత మార్కెట్ పరిధిలోకి వెళ్లడంతో తాము వారిని బతిమిలాడి నీటిని వాడుకోవాల్సి వస్తోందని అంటున్నారు. పాఠశాల మైదానంలో మొరం పోయించి.. మూత్రశాలలకు నీటి వసతి కల్పించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



తర్లపాడ్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



కుభీర్‌లో నివాళులర్పిస్తున్న కార్యకర్తలు



రాజూరలో నివాళులర్పిస్తున్న సర్పంచ్ ముత్తగౌడ్

ఖానాపూర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఆద్యుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకులు భుక్య జాన్సన్‌నాయక్ అన్నారు. మండలంలోని తర్లపాడ్‌లో మంగళవారం దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు కొత్తపేటలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. అమరగొండ మల్లేశ్, పెద్ది నర్సయ్య, నర్సయ్య, దాసరిగొండ మల్లయ్య, ఎనుగుల రాజేశ్వర్, మల్లేశ్, రమేశ్, సాయన్న, గంగమల్లు, రాములు, రాజన్న తదితరులున్నారు.
కుభీర్: మండల కేంద్రంలో హిందూ వాహిని ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి, దొడ్డి కొమరయ్య వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో హిందువాహిని కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.
లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామంలో మంగళవారం దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ ముత్తగౌడ్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ పోతన్న, గంగాధర్, ప్రవీణ్ తదితరులున్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

తానూరు: వర్షాకాలంలో రోగాల బారిన పడకుండా పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండలంలోని ఖర్బాలాలో పర్యటించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెత్తను ఇష్టానుసారం పడేయకుండా పంచాయతీ ట్రాక్టర్‌లో వేయాలన్నారు. అనంతరం ప్రకృతివనం, నర్సరీ పరిశీలించి కార్యదర్శి జీవన్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయినాథ్, పలువురు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.
భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో మంగళవారం డ్రై డే నిర్వహించారు. పలు కాలనీల్లో ఇంటింటా తిరిగి పరిసరాలు, కూలర్లు, కుండీలు, ట్యాంకుల్లో ఉన్న చెత్త, నిల్వ నీటిని పారబోయించారు. కార్యదర్శి గాయత్రి, రాంకుమార్, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.
ఖానాపూర్: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతీ శుక్ర, మంగళవారాల్లో డ్రై డే నిర్వహిస్తున్నారు. మండలంలోని చందునాయక్ తండాలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యదర్శి అనిల్, కోఆప్షన్ సభ్యులు నిమ్యానాయక్, ఆశావర్కర్ లలిత, అంగన్‌వాడీ టీచర్ అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ప్రభుత్వం



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: నిరుపేదలకు ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా అండగా నిలుస్తుందని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దేగాంలో తన నివాసంలో పలువురు బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. భైంసా మండలం టాక్లీకి చెందిన కృష్ణవేణికి రూ.11వేలు, ముథోల్ మండలం ఎడ్‌బిడ్‌కు చెందిన లస్మన్నకు రూ.26వేలు, బాసర మండలం బిద్రెల్లికి చెందిన రాజమణికి రూ.55వేలు, తానూరు మండలం కోలూరుకు చెందిన భూమన్నకు రూ.లక్ష విలువైన చెక్కులు అందజేశారు.
భైంసాటౌన్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద మంగళవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. పట్టణానికే చెందిన ఏడుగురికి రూ.మూడు లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. పార్టీ పట్టణ కార్యదర్శి తోట రాము, సూర్యనారాయణ, శ్యాంసుందర్ తదితరులున్నారు.

గ్రామాల్లో మొక్కలు పంపిణీ



చామన్‌పెల్లిలో మొక్కలు అందిస్తున్న శేఖర్

లక్ష్మణచాంద: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం పంచాయతీల ఆధ్వర్యంలో హోమ్‌సీడ్ మొక్కలు నాటారు.చామన్‌పెల్లిలో ఎంపీడీవో శేఖర్ మొక్కలు అందజేశారు. జెడ్పీటీసీ రాజేశ్వర్, ఎంపీడీవో శేఖర్, ఎంపీవో నసీరుద్దీన్, సర్పంచ్ గంగాధర్, ఎంపీటీసీ అనిత తదితరులు పాల్గొన్నారు.
ముథోల్: మండలంలోని మచ్కల్‌లో ఎంపీడీవో సురేశ్‌బాబు మొక్కలు పంపిణీ చేశారు.
నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ రాంరెడ్డి గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ చిన్నరామయ్య, ఎంపీటీసీ మల్లేశ్, రమేశ్, గంగారెడ్డి, కార్యదర్శి వీణారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.
భైంసారూరల్: మండలంలోని లింగా గ్రామంలో సర్పంచ్ గణేశ్ మంగళవారం మొక్కలను పంపిణీ చేశారు. హరితహారంలో భాగంగా ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలత, గ్రామస్తులు ఉన్నారు.

నేడు కుభీర్‌కు మంత్రి రాక

కుభీర్: పోడు పట్టాలు పంపిణీ చేసేందుకు బుధవారం మంత్రి ఐకేరెడ్డి కుభీర్‌కు రానున్నట్లు ఎంపీపీ తూములక్ష్మీబాయి తెలిపారు. మంగళవారం కార్యక్రమ ఏర్పాట్లను వారు పరిశీలించి మాట్లాడారు. మొత్తం 12 పంచాయతీల్లో 278మందికి మంత్రి చేతుల మీదుగా పట్టాలు అందజేస్తారని పేర్కొన్నారు. లబ్ధిదారుల జాబితాలో ఉన్న గిరిజనులు మండల కేంద్రంలోని నగేశ్ ఇండస్ట్రీస్‌కు రావాలని కోరారు. అంతకుముందు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, అంబాజీనాయక్, ఎంపీడీవో లింబాద్రి, తహసీల్దార్ విశ్వంబర్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

చెక్కు అందజేత

సోన్: మండల కేంద్రానికి చెందిన చిన్నమ్మకు రూ.19,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. ఈమేరకు మంత్రి ఐకే రెడ్డి తన చాంబర్లో బాధితురాలికి చెక్కు అందించారు. బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ మోహినొద్దీన్, యూత్ మండలాధ్యక్షులు అంబేకర్ ప్రసాద్, శ్రీనివాస్, పత్తి రాజు, ప్రకాశ్, లింగన్న, నర్సయ్య పాల్గొన్నారు.
కుంటాల: మండలంలోని అందకూర్ గ్రామంలో బోయిడి మానసకు రూ.55వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. మంగళవారం చెక్కును ఆమె భర్త గణేశ్‌కు సర్పంచ్ దాసరి కిషన్ అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మధుకర్, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ కన్వీనర్ బొండ రవి, భోజన్న, కమలాకర్, పండరి పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

ముథోల్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ టెస్టులో ముథోల్ జెడ్పీఎస్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన ఆర్.గాయత్రి, పి.వినాయక్ జోడి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.7500 నగదు బహుమతి గెలుచుకున్నారు. కాగా వారిని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

దరఖాస్తు చేసుకోవాలి

కుంటాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో 2022–23లో ఇంటర్ పూర్తి చేసిన 22 మంది విద్యార్థులకు ఎంహెచ్ఆర్‌డీ(మినిస్టరీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్) ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్‌లో 900కుపైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వివేకానందుడి బాటలో నడవాలి

నిర్మల్‌చైన్‌గేట్: విద్యార్థులు వివేకానందుడి బాటలో నడవాలని సామాజిక సేవకుడు కొటిక శ్రీనివాస్ అన్నారు. స్వామి వివేకానంద వర్ధంతి పురస్కరించుకొని మంగళవారం కొండాపూర్ శాంతినికేతన్ మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో విద్యార్థులకు వివేకానందుడి సూక్తులతో ఉన్న పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో వరప్రసాద్, ప్రిన్సిపాల్ సాయిప్రసాద్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన నాంపెల్లి మల్లేశ్ అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. దీనిపై మే20న సాక్షిలో నా కొడుకును కాపాడండి అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి పలువురు స్పందిస్తున్నారు. మంగళవారం జైజవాన్.. జైకిసాన్ ఫౌండేషన్ సభ్యులు మల్లేశ్‌ను పరామర్శించి ఆయన తల్లి రామవ్వకు రూ.ఐదు వేలు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, యెల్లంకి భూపాల్, పాలకుర్తి కృష్ణ, బుగ్గారం లింగన్న, ఇందూర్, గంగాధర్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

కుంటాలలో భారీ వర్షం

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పత్తి, సోయాబీన్ విత్తనాలు విత్తిన రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది.

'అల్లూరి' పోరాటస్ఫూర్తితో ముందుకెళ్లాలి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

భైంసారూరల్: విద్యార్థులు అల్లూరి పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మిర్జాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు కడారి దశరథ్, సత్యనారాయణ, గజేందర్, శ్రీనివాస్, శంకర్, మల్లికార్జున్, అరుణ తదితరులు ఉన్నారు.
ముథోల్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సారథిరాజు, ఆచార్యులు, విద్యార్థులు ఉన్నారు.

'అధికారులపై చర్యలు తీసుకోవాలి'



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న పోడు రైతులు

ఖానాపూర్: పోడు భూముల సర్వేలో ఉన్న పేర్లను.. పట్టాల పంపిణీ సమయంలో జాబితాలో నుంచి తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో మండలంలోని సేవానాయక్‌తండా గిరిజనులు మంగళవారం ఎమ్మెల్యే రేఖానాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నంది రామయ్య మాట్లాడారు. గ్రామసభలు, సర్వేల్లో లబ్ధిదారులుగా గుర్తించిన పోడు రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని కోరారు. సేవానాయక్‌తండాకు చెందిన 50 మంది గిరిజనులు 30 ఏళ్లుగా అడవిసారంగాపూర్ పంచాయతీలోని జిల్లేడికుంటలో పోడు భూములు సాగు చేసుకుంటున్నారన్నారు. అప్పులు చేసి భూములను అభివృద్ధి చేస్తే పట్టాలు పంపిణీ చేయలేదని వాపోయారు. అనంతరం తర్లపాడ్‌లోదొడ్డి కొమురయ్య విగ్రహం వద్ద నివాళులర్పించారు.

బీజేపీతోనే సమగ్ర అభివృద్ధి

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి



బైక్ ర్యాలీలో పాల్గొన్న అధ్యక్షురాలు రమాదేవి

భైంసాటౌన్:ముథోల్ నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారిందని, బీజేపీ అధికారంలోకి వస్తే నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పి.రమాదేవి అన్నారు. మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్ కార్యక్రమంలో భాగంగా పట్టణ, మండల విస్తారక్ బాలకృష్ణయాదవ్, మార్కండేయ నేతృత్వంలో మంగళవారం స్థానిక వివేకానందచౌక్ నుంచి పంజేషాచౌక్, పురాణబజార్, కిసాన్‌గల్లి, మిర్చిమార్కెట్ రోడ్, టిప్పుసుల్తాన్‌చౌక్ మీదుగా శివాజీచౌక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు ఆమె మాట్లాడుతూ.. భైంసాలో ఏకపక్షంగా అభివృద్ధి పనులు చేస్తున్నారని, బీజేపీ అధికారంలోకి వస్తే పారదర్శకంగా అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణ అధ్యక్షుడు మల్లేశ్, నాయకులు బాలాజీ సుత్రావే, జిల్లా ఉపాధ్యక్షులు కారిగిరి భూషణ్, శ్రీనివాస్, ఓబీసీ అసెంబ్లీ కన్వీనర్ అనిల్, సంపత్‌పటేల్, రమేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ధరణితో బాగుపడింది కేసీఆర్ కుటుంబమే'

లోకేశ్వరం: ధరణితో కేసీఆర్ కుటుంబం తప్ప ఎవరూ బాగుపడలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మీ నగర్‌తండా, సేవాలల్‌తండాల్లో పల్లె పల్లెకు బీజేపీ గడప గడపకూ మోహన్‌రావు పటేల్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. సుభాశ్‌పటేల్, పోతన్న, నరహరి, అనిల్, భూమన్న ఉన్నారు.

'కాంగ్రెస్ గెలుపు ఖాయం'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్:రానున్న ఎన్నికల్లో అటు రాష్ట్రంలో ఇటు కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నాయకుడు కూచాడి శ్రీహరిరావు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.నాలుగు వేల పింఛన్‌తోపాటు రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు పెట్టుబడిసాయం కింద రూ.15 వేల ఇస్తామన్నారు. బీఆర్‌ఎస్ అడ్డంకులు సృష్టించినా లక్షలాది మంది తరలివచ్చి ఖమ్మం జిల్లా జనగర్జన లో సభ విజయవంతం చేశారన్నారు. రూ.4 వేల పింఛన్ ఇస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు తమకు ఓటు వేయకుంటే పింఛన్ కట్ చేస్తామని బెదిరిస్తున్నారని.. ఎవరూ భయపడొద్దని సూచించారు. ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు, ఎల్‌పీజీ సిలిండర్ రూ.500కే ఇస్తామని తెలిపారు. ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. సమావేశంలో సారంగాపూర్ జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, అహ్మద్‌ఖాన్, ప్రతాప్‌రెడ్డి, రమణారెడ్డి, అతీక్ అహ్మద్, అజర్, జునైద్, చిన్ను, రవికుమార్ పాల్గొన్నారు.

పలువురి చేరిక..

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రానికి చెందిన పలువురు మహిళలు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈమేరకు ఆ పార్టీ నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా ఇన్‌చార్జి ఎంబడి రాకేశ్, నాందేడపు చిన్ను పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులతో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

కుంటాల: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు, గౌరవం దక్కుతాయని.. ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదవాలని సర్పంచులు సమతా వెంకటేశ్, మగ్గిడి శృతి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల నుంచి బాసర ట్రిపుల్ ఐటీకి 18 మంది విద్యార్థులు ఎంపికవగా మంగళవారం వారికి పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థుల చదువులపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్‌ను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మగ్గిడి దిగంబర్, కల్యాణ్ గజేందర్, తాటి శివ, జక్కుల గజేందర్, లక్ష్మణ్, అనిల్ కుమార్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

సారంగపూర్: మండలంలోని యాకర్‌పెల్లి గ్రామానికి చెందిన మాదస్తు రాజేశ్వర్ కుమారుడు సిద్దు ఇటీవల ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడంతో మంగళవారం గ్రామస్తులు అతడిని సన్మానించారు. బీఆర్‌ఎస్ నాయకుడు వెంకట్, ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, అడెల్లి ఆలయ డైరెక్టర్ రాజేశ్వర్, నవీన్, రవి, గజ్జన్న తదితరులు ఉన్నారు.
లక్ష్మణచాంద: మండలంలోని పొట్లపెల్లి(కే) గ్రామానికి చెందిన మణిదీప్ బాసర ట్రిపుల్ ఐటీలో సాధించాడు. మంగళవారం అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు హంసలత మణిదీప్‌ను శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా వింగ్స్ ఆఫ్ ఫైర్ అనే పుస్తకం అందజేశారు.

సన్మానం

ఖానాపూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఖానాపూర్ ఫొటోగ్రాఫర్ పడిగెల కాశీనాథ్ దంపతులను సన్మానించారు. శ్రీనివాసకృష్ణస్వామి, మల్లేశ్, వరుణ్, సాయి తదితరులు ఉన్నారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

లోకేశ్వరం: మండల కేంద్రంలో మంగళవారం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు గురుమంచి చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో నిత్యనిధి, చండీరుద్ర హోమం, ధాన్యధివాసం, పూజలు నిర్వహించారు.